క్లుప్తంగా

కంట్రోల్ రూం ఏర్పాటు

మందమర్రిరూరల్: వర్షాలకు ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం వరద సహాయక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇల్లు గల వారు కంట్రోల్ రూంను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కంట్రోల్ రూం 24గంటలు అందుబాటులో ఉంటుందని, సంబంధిత అధికారులు శ్యాంసుందర్ శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ 9701677660, ఎంఏ సమీర్ హెల్త్ అసిస్టెంట్ 8341839921, మేకల నరేష్ 7386867688, అచ్యుత్ ఏఈ 7893683300, లింగంపల్లి రవి 9398471497, రాజ్‌కుమార్ టీపీఎస్ 8341839921, రవీందర్ ఓఎస్‌డబ్ల్యూ 7799233649, ల్యాండ్‌ఫోన్ నంబర్ 08736-256611, టోల్ ఫ్రీ నంబర్ 18004253611లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

జన్నారం: మండలంలోని తపాలపూర్ ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం విద్యుత్ తీగలు తెగి పడిపోయాయి. భారీ వర్షం కురుస్తుండగా తీగలు పడటంతో ఒక్కసారి భయందోళనలకు గురయ్యారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం సంభవించలేదు. స్థానిక ఎస్సై సతీశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి, తీగలను తీసేయించారు.

వర్షంలోనూ సమ్మె..



హాజీపూర్‌లో వర్షంలో తడుస్తూ సమ్మె

నెన్నెల/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోని సీఎం కేసీఆర్‌ను వెంటనే గద్దె దించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏమాజీ అన్నారు. నెన్నెల, కన్నెపల్లి మండలాల్లో బుధవారం పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించారు. హాజీపూర్‌లో కార్మికులు వర్షంలో తడుస్తూ మరీ నిరసన తెలియజేశారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, నెన్నెల మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, జిల్లా నాయకులు అజ్మీర శ్రీనివాస్, బీజేపీ కన్నెపల్లి మండల అధ్యక్షుడు బేర రామయ్య యాదవ్, పారిశుద్ధ్య కార్మికుల మండల అధ్యక్షుడు కొట్టంగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన ముత్తె రాజయ్యకు గల ఎద్దు బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఉదయం మేతకు పొలాల వైపు వెళ్లిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.45వేలు ఉంటుందని, బాధిత రైతు తెలిపాడు. తనకు తగిన పరిహారం అందించాలని వేడుకుంటున్నాడు.

ముగిసిన భాగవత సప్తాహం



ముగింపు వేడుకలకు హాజరైన భక్తులు

చెన్నూర్: పట్టణంలోని బ్రాహ్మణసేవా సంఘ భవనంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అధికశ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 19న ప్రారంభమైన భాగవత సప్తాహం బుధవారం ముగిసింది. ముగింపు వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రవచనాలు వినిపించిన మల్లాది వెంకట రామనాథశర్మను బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

'ప్రజాపంథా మార్గమే సరైన మార్గం'

జన్నారం: ప్రజాపంథ మార్గమే సరైన మార్గమని సీపీఎం ఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కామ్రేడ్ రమ పేర్కొన్నారు. మండలంలోని చింతగూడ గ్రామంలో బుధవారం న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు ఏఐకేఎంఎస్ జిల్లా సహాయక కార్యదర్శి పురంశెట్టి బాపు అతడి అనుచరులు ప్రజాపంథా పార్టీలో చేరారు. రమ మాట్లాడుతూ.. బాపు, తన అనుచరులు పార్టీలో చేరడం వల్ల పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రజాపంథా పార్టీ నాయకులు నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు దేవరాజు, పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు రమ, ఏఐపీకేఎస్ నాయకులు అంకూస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'బాపును పార్టీ నుంచి బహిష్కరించాం'

జన్నారం: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీలో పనిచేస్తూ అవకతవకలకు పాల్పడిన చింతగూడ గ్రామానికి చెందిన పురంశెట్టి బాపును పార్టీ నుంచి బహిష్కరించినట్లు అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఇఫ్ట్ రాష్ట్ర నాయకుడు వెంకటనారాయణ, నాయకులు రాజేశ్, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

వాన జోరు.. ఆగని తీరు



మత్తడి దూకుతున్న నీల్వాయి ప్రాజెక్టు

- ఉప్పొంగిన వాగులు, ఒర్రెలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- చెరువులను తలపించిన పంట పొలాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షం జోరుగా కురిసింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. పలు చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. పంట పొలాల్లో నీరు చేరి అధ్వానంగా తయారయ్యాయి. వంతెనల పై నుంచి వాగులు పారడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఉప్పొంగిన ఎర్రవాగు



నెన్నెల: మండలంలోని నెన్నెల లంబాడితండా ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో లంబాడితండా, కుర్మగూడం, కోణంపేట, బోగంపల్లి, మన్నెగూడం, ఖర్జీ, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట గ్రామాల ప్రజలకు బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలకు వెళ్లిన రైతులు ఇబ్బంది పడి నాలుగు గంటల తర్వాత ఒకరి చేయి ఒకరు పట్టుకొని వాగు దాటి నెన్నెలకు చేరుకున్నారు. నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ ఎర్రవాగును సందర్శించి పరిశీలించారు. సాహసం చేసి ఎవరూ వాగును దాటకుండా పోలీసులను కాపలా ఉంచారు. 108అంబులెన్స్ సైతం గ్రామాలకు రాదని, ఆ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 2రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ ప్రకటించిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని ఎస్సై పేర్కొన్నారు.

గొల్లవాగు ప్రాజెక్టు కాలువకు గండి



చెన్నూర్‌రూరల్: భారీ వర్షాలకు మండలంలోని కత్తెరసాల, నారాయణపూర్, రాయిపేట, సుద్దాల, బుద్దారం, సంకారం గ్రామాల సమీపాల్లోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అక్కెపల్లి గ్రామానికి వెళ్లే దారిలోని వాగు ఉప్పొంగడంతో లో లెవల్ కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహించగా రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల సమీపాల్లోని పంట చేళ్లల్లో నీరు నిలిచింది. ఎర్రగుంటపల్లి గ్రామ సమీపంలో ఉన్న గొల్లవాగు ప్రాజెక్టు కాలువకు గండి పడింది. పంట పొలాలకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందిగా మారింది.



అక్కెపల్లి గ్రామానికి వెళ్లే దారిలో...

అంకెపల్లి చెరువుకు గండి



తాండూర్: మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంకెపల్లి చెరువుకు కొత్తగా నిర్మించిన తూము కిందకు కృంగి బీటలు వారడంతో చెరువుకట్టకు గండి పడింది. దీంతో చెరువులోని నీరు పంట పొలాల్లో చేరింది. పంట పొలాలు కుంటను తలపించాయి. ఇప్పటికే రైతులు వరినారు పోసుకుని ఉండటంతో నారు నీట మునిగింది. గండిపడిన సమాచారాన్ని తెలుసుకుని మండల రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ మురళీధర్ రావు సిబ్బందితో వచ్చి పరిస్థితిని సమీక్షించారు. చెరువుకు పడిన గండిని పూడ్చడానికి గ్రామపంచాయతీ అధికారులతో కలిసి సంయుక్తంగా చర్యలు చేపట్టారు. నీట మునిగిన వరినారు విలువ రూ.లక్షల్లో ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

అన్నదాత ఆగమాగం

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో వర్షానికి పంట చేళ్లలో నీరు చేరింది. చెరువులు, కుంటలు నిండాయి. వాగులు పొంగిపొర్లాయి. కన్నెపల్లి సబ్‌స్టేషన్ నుంచి వెంకటాపూర్‌కు వెళ్లే దారి బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చింతపుడి, లింగాల గ్రామాల్లో రోడ్లు బురదమయం కావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



బురదలో దిగబడిన వాహనాలు..



రైల్వే అండర్‌బ్రిడ్జిలో దిగబడిన వాహనం

తాండూర్: మండలంలోని రేచినీ రోడ్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన అండర్ బ్రిడ్జి వాహనాలకు తీవ్ర ఆటంకంగా మారింది. బురదగా మారి, మోకాలి లోతులో వరద నీరు వచ్చి చేరింది. దీంతో అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి అండర్ బ్రిడ్జిలో నుంచి ఎరువుల లోడుతో వచ్చిన ఓ వ్యాన్ అండర్ బ్రిడ్జి మధ్యలోకి వెళ్లి బురదలో ఇరుక్కుపోయింది. బుధవారం ఉదయం కూడా మరో వాహనం బురదలో ఉండిపోవడంతో రైల్వేస్టేషన్ నుంచి గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. కొత్తగా నిర్మించిన అండర్ బ్రిడ్జి వద్ద కాంట్రాక్టర్ సరిగ్గా రోడ్డు నిర్మించకపోవడంతో వాహనాలు బురదలో చిక్కుకుంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

జైపూర్‌లో రాకపోకలకు అంతరాయం



జాతీయ రహదారిపై చేరిన వరద నీరు

జైపూర్: మండలంలోని రసూల్‌పల్లి, ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్, ఇందారం, రామారావుపేట, టీకుమట్ల, పెగడపల్లి, గంగిపెల్లి, శెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, శివ్వారం గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. వరద నీరు రోడ్లపై చేరడంతో రసూల్‌పల్లి వద్ద మంచిర్యాల, చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెగడపల్లి ఈదులాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. టీకుమట్ల వద్ద వాగు ఉప్పొంగడంతో రాకపోకలను పోలీస్ అధికారులు పూర్తిగా నిలిపివేశారు. పంట పొలాల్లో వరద నీరు నిలిచింది. కుంటల్లోకి భారీగా వరద నీరు చేరింది. రసూల్‌పల్లి వద్ద పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించింది.

పొంగిపొర్లిన వాగులు

వేమనపల్లి: మండలంలో బుధవారం పొద్దంతా భారీ వర్షం కురిసింది. దీంతో నీల్వాయి , మత్తడి, బతుకమ్మల వాగులు భారీ వరద నీటితో ప్రవహిస్తున్నాయి. నీల్వాయి ప్రాజెక్టులోకి వరద తీవ్రత పెరుగుతుండటంతో మత్తడి దూకి వాగులోకి వెళ్తోంది. అదేవిధంగా చామనపల్లి వాగుకు వరద ఉధృతికి ప్రయాణికులు దాటలేకపోతున్నారు. వివిధ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.



చెరువులను తలపిస్తున్న పొలాలు

జిల్లా కేంద్రానికి వరద ముప్పు



రాంనగర్‌లో ఇళ్ల మధ్య వరద నీరు



శ్రీనివాస కాలనీలో...

మంచిర్యాలటౌన్/పాతమంచిర్యాల/మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షానికి పట్టణంలోని రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీల్లో వర్షపునీరు నిండి రోడ్లపైనే మోకాళ్ల లోతుకు చేరింది. గంట తరువాత వర్షం తగ్గుముఖం పట్టడంతో, రోడ్లపై చేరిన వరద నీరు డ్రెయినేజీల్లోకి వెళ్లి, ముప్పు తప్పింది. రాంనగర్, రెడ్డికాలనీ, గౌతమినగర్, ఎన్టీఆర్‌నగర్,శ్రీనివాస కాలనీ,చున్నంబట్టి వాడ కాలనీల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గతేడాది ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్‌లోని ఇళ్లు మునగ్గా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కార్మిక కాలనీల్లో వరదనీరు

శ్రీరాంపూర్: భారీ వర్షంతో సింగరేణి కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి శ్రీరాంపూర్, నస్పూర్ ఏరియాలో సింగరేణి కాలనీల్లో వరద నీరు వచ్చి చేరింది. మెయిన్ డ్రెయినేజీ నీరు పొంగిపొర్లడం, పై వాడల నుంచి వచ్చిన వరద నీరంతా ఇళ్లలోకి చేరింది. దీంతో పలువురు కార్మికుల ఇళ్లలోని గదుల్లో నీరు చేరి, వంట సామగ్రి, గృహోపకరణాలు, దుస్తులు, బియ్యం తడిసిపోయాయి. శ్రీరాంపూర్‌లోని భగత్‌సింగ్‌నగర్, ఝాన్సీ నగర్, అరుణక్కనగర్‌లో కాలువలు పొంగడంతో వరద నీరు ఇళ్లలోకి చేరింది. మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి వాడల్లో తిరుగుతూ సహాయ చర్యల్లో పాల్గొన్నారు.



జలమయమైన నస్పూర్ కాలనీలోని ఓ వాడ

ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి..

వర్షం వల్ల శ్రీరాంపూర్ ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. బొగ్గు పెళ్ల కూడా బయటికి రాలేదు. ఎక్కడి డంపర్లు, షవల్స్ అక్కడే నిలిచిపోయాయి. రోజు వారీగా తీసే 12వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 60వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు ఆగిపోయాయి.



క్వార్టర్‌లో చేరిన వరద నీరు

ఎజెండా అంశాలు ఏకగ్రీవంగా తీర్మానం

బెల్లంపల్లి: మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఎజెండాలో పొందుపర్చిన అంశాలపై సభ్యులు చర్చించి, తగు తీర్మానాలు చేశారు. వర్షాకాలంలో ఇళ్లపై వేలాడుతున్న కరెంట్ తీగలను సవరించాలని, మున్సిపాలిటీలో వర్షానికి దోమలు వృద్ధి చెందకుండా త్వరగా నివారణ చర్యలు తీసుకోవాలని ఇందుకోసం మురుగునీటి కాలువల్లో, మురుగు గుంటల్లో బ్లీచింగ్ ఫౌడర్ చల్లించాలని, ప్రత్యేకంగా ఫాగింగ్ యంత్రం కోసం తీర్మానాలు చేశారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చర్యలు తీసుకుని పూడ్చివేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, కాల్‌టెక్స్ ఏరియా పరిధి 12,13వార్డుల్లో డ్రెయినేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, 19వార్డులో గాంధీ చౌరస్తా వరకు రోడ్డు నిర్మించాలని, డంపింగ్ యార్డులో అప్రోచ్ రోడ్డు, కంపోస్టు షెడ్ నిర్మించాలని, పోచమ్మ చెరువు వద్ద, మున్సిపల్ 34వార్డుల్లో వచ్చే వినాయక చవితి, బతుకమ్మ వేడుకల కోసం లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చర్యలు చేపట్టాలని, పెద్ద కాలువల్లో జేసీబీతో పూడిక తీత పనులు నిర్వహించాలని తీర్మానాలు చేశారు. కౌన్సిలర్లు పలువురు బస్తీల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కమిషనర్ సమ్మయ్య, ఏఈ సందీప్, టీఓ అశ్రిత్, ఆర్‌ఓ భుజంగరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్వేత

ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



మందమర్రిలో...

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్: కార్గిల్ విజయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో మరణించిన 527మంది భారత వీర జవాన్లకు బుధవారం కొవ్వొత్తులతో జిల్లా కేంద్రంలో శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు బాలాజీ, కోశాధికారి రామస్వామి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ వి.మధుసూదన్ రెడ్డి, రీజియన్ చైర్మన్ సుగుణాకర్ రెడ్డి, డేగ బాపు, వినయ్ కుమార్, ఇరుకుల్ల ఆనంద్, గుండా శ్రీనివాస్, అనిల్ కుమార్, దొంతుల ముఖేశ్, చందూరి మహేందర్ పాల్గొన్నారు. మందమర్రిలో కార్గిల్ యుద్ధ వీరుడు విజయ్ మెడలిస్ట్ అవార్డు గ్రహీత సింగరేణి సెక్యూరిటీ గార్డ్ రాజేష్ పిహ్వాల్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు తిరుమల్లేష్, మధు, శ్రీనివాస్, అనీత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రిజర్వేషన్స్ డే

పాతమంచిర్యాల: ఛత్రపతి సాహూ మహారాజ్ స్ఫూర్తితో బహుజనులు ఉద్యమించాలని సామాజిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ ఐక్య వేదిక కార్యాలయంలో బుధవారం రిజర్వేషన్స్ డే నిర్వహించారు. ఛత్రపతి సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, న్యాయవారి కర్రె లచ్చన్న, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, గాండ్ల తిలకేశ్వర సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



భీమారంలో తనిఖీలు నిర్వహిస్తూ..

భీమారం/జైపూర్: వ్యవసాయ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో భీమారం, జైపూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లోని పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. భీమారంలో శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై రాజవర్ధన్, జైపూర్‌లో శ్రీరాంపూర్ సీఐ రమేష్, జైపూర్ ఇన్‌చార్జి ఎస్సై నాగరాజు, ఏవో మార్కు గ్లార్‌స్టన్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జన్నారం: భారీ వర్షాలు కురుస్తున్నందునా వాగు పరీవాహక ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని, లక్సెట్టిపేట సీఐ ఆర్.కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని జువ్విగూడ, బుడుగ జంగాలకాలనీ వాసులకు బుధవారం అవగాహన కల్పించారు. అధిక వర్షాలు పడుతున్నందునా వాగులు ఉప్పొంగితే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, సమాచారం ఇవ్వాలని సూచించారు.ఆయన వెంట జన్నారం ఎస్సై సతీశ్, తదితరులున్నారు.

కాంగ్రెస్ విజయానికి తోడ్పాటు అందించాలి

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

బెల్లంపల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి అంజన్‌కుమార్, ఎల్‌ఎండీ జాతీయ కోఆర్డినేటర్ హర్షద్ తెలిపారు. బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని ఏఆర్ కన్వెన్షన్ హాల్లో బుధవారం జరిగిన లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్(ఎల్‌ఎండీ)ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు శంకర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేష్, రాష్ట్ర మహిళ కార్యదర్శి శారద, ఓబీసీ సెల్‌జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రజిత, కాంగ్రెస్, అనుబంధ సంఘాల బాధ్యులు స్వామి బానేష్, ఆదర్శ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షంలోనూ... సమస్యలు వింటూ...

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 28వ వార్డు వికాస్‌నగర్‌లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ భారీ వర్షంలోనూ గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలను వింటూ భరోసా కల్పించారు.



మాట్లాడుతున్న సురేఖ

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులను అధిష్టానం ప్రకటించినట్లుగా తెలుస్తోంది. బెల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సింగతి సత్యనారాయణ, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడిగా ముచ్చర్ల మల్లయ్య, భీమిని మండల అధ్యక్షుడిగా గధం లక్ష్మీనారాయణ, కాసిపేట మండల అధ్యక్షుడిగా రత్నం ప్రదీప్, నెన్నెల మండల అధ్యక్షుడిగా గట్టు మల్లేష్, వేమనపల్లి మండల అధ్యక్షుడిగా సయ్యద్ సాబీర్ పాషా, తాండూర్ మండల అధ్యక్షుడిగా మహ్మద్ ఈసా, కన్నెపల్లిమండల అధ్యక్షుడిగా పప్పుల రామాంజనేయులును నియామకం చేస్తూ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మల్లు రవి ఉత్తర్వులు జారీ చేశారు.

పీరీలకు మొక్కులు

చెన్నూర్‌రూరల్/నెన్నెల: మొహర్రం పండుగలో భాగంగా ఏడో రోజు చిన్న సర్గత్ సందర్భంగా బుధవారం పీరీలకు కుల, మతాలకు అతీతంగా ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి మలీద ముద్దలు, కుడకలను నైవేద్యంగా సమర్పించుకున్నారు.